ఓటర్లలో అతివలే అధికం


- పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,86,679
- కొత్త ఓట్లు 30,995
- తొలగించిన ఓట్లు 19,402
- మహిళా ఓటర్లే అధికం

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గం (78)లో ఓటర్లు పెరిగారు. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు సోమవారం ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. గతంలో పోల్చితే ఓటర్లు 12,048 మంది పెరిగారు. జనవరి 2023 సంవత్సరంలో పెనమలూరు నియోజకవర్గంలో ఓటర్లు 2,74,631 మంది ఉండగా తాజాగా ప్రకటించిన ఓటర్ల జాబితాలో మొత్తం ఓట్లు 2,86,679 మంది అయ్యారు. కొత్తగా ఓట్లు 30,995 మందిని చేర్చారు. అలాగే మరణించిన ఓట్లు 8535, బదిలీ ఓట్లు 8968, డూప్లికేట్ ఓట్లు 1899 కలిపి మొత్తం 19,402 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం పెనమలూరు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..


మహిళా ఓట్లే అధికం..

పెనమలూరు నియోజకవర్గంలో మహిళా ఓట్లే అధికంగా నమోదు అయ్యాయి. పెనమలూరు నియోజకవర్గంలో పురుషులు 1,38,540 మంది ఉండగా మహిళా ఓట్లు 1,48,136 వంతున ఉన్నాయి.

పురుషుల కంటే మహిళా ఓటర్లు 9,596 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గ పరిధిలోని తాడిగడప మున్సిపాలిటీ ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో ఏకంగా 1,32,063 మంది ఓటర్లు ఉన్నారు. మిగితా ప్రాంతాల్లో ఓటర్లు 1,54,616 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో కొత్తగా యువత 5258 మంది ఓటు హక్కు పొందారు. తాడిగడప మున్సిపాలిటీలో 2318 మంది యువ ఓటర్లు నమోదయ్యారు.



మున్సిపాలిటీ/మండలం	పీఎస్	పురుషులు	స్త్రీలు	టీజీ	మొత్తం ఓట్లు
వైఎస్సార్ తాడిగడప	124	64,557	67,505	1	1,32,063
పెనమలూరు	42	18,162	19,871	0	38,033
కంకిపాడు	64	25,958	28,522	1	54,481
ఉయ్యూరు అర్బన్	37	15,631	16,757	0	32,388
ఉయ్యూరు రూరల్	37	14,232	15,481	1	29,714
మొత్తం	304	1,38,540.	1,48,136.	3	2,86,679



గన్నవరం నియోజకవర్గంలో..

గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలోని మొత్తం పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 9,630 మంది ఎక్కువగా ఉన్నారు. ఈ మేరకు సోమవారం ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. తుది జాబితా ప్రకారం మొత్తం నియోజకవర్గంలో 2,77,323 మంది ఓటర్ల ఉన్నట్లు ఎన్నికల నమోదు అధికారి బీ చంద్రలీల తెలిపారు. వీరిలో పురుషులు 1,33,839 మంది, మహిళలు 1,43,469 మంది, ఇతరులు 15 మంది ఉన్నట్లు తెలిపారు. వీరు కాకుండా రక్షణ రంగంలోని సర్వీస్ ఓటర్లు 70 మంది, విదేశాల్లో ఉన్న భారతీయ ఓటర్లు 49 మంది ఉన్నట్లు చెప్పారు. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,072 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. గతంలో ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా కంటే ప్రస్తుతం 12,166 మంది ఓటర్లు పెరిగినట్లు తెలిపారు. తుది ఓటర్ల జాబితాలు నియోజకవర్గంలోని 306 పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు పని వేళల్లో వెళ్లి ఓటర్ల జాబితాను సరిచూసుకోవచ్చని సూచించారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 9,630 మంది అధికంగా ఉండడంతో రానున్న ఎన్నికల్లో మహిళా ఓటర్లే అత్యంత కీలకం కానున్నారు.

మండలాల వారిగా ఓటర్లు..

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	మొత్తం
విజయవాడ రూరల్	42,550	44,623	4	87,177
గన్నవరం	35,418	38,549	4	73,971
బాపులపాడు	34,907	37,328	3	72,238
ఉంగుటూరు	20,964	22,969	4	43,937
మొత్తం	1,33,839	1,43,469	15	2,77,323

క్లుప్తంగా

ఎస్సీలకు న్యాయం జరిగేలా కృషి

పెనమలూరు నియోజకవర్గ మాజీ సమన్వయకర్త సురేష్ బాబు



కంకిపాడు: నిరుపేద ఎస్సీ కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ మాజీ సమన్వయకర్త పడమట సురేష్ బాబు అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో సోమవారం ఆయన పర్యటించారు. ఎస్సీలకు కేటాయించిన భూములను పరిశీలించారు. వైఎస్ఆర్ హయంలో ప్రొద్దుటూరులో 35 మంది ఎస్సీలకు భూములను కేటాయించాన్నారు. గత టీడీపీ ప్రభుత్వం భూములను సర్వే చేసి ఎస్సీలకు అప్పగించడంలో విఫలమైందన్నారు. తమకు నష్టం జరుగుతుందనే భావనతో అధికారులతో కుమ్మక్కై సర్వేలు జరగకుండా సాంకేతిక సమస్యలను సష్టిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని స్పష్టం చేశారు. పర్యటనలో రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ పాల్గొన్నారు.

312 మందికి వైద్య సేవలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ అన్నారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 312 మంది వైద్య సేవలు పొందారు.మంగళవారం పెనమలూరు పీహెచ్‌సీ వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం

గన్నవరం: నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ తోట కరుణను సత్కారించారు. ఈ మేరకు సోమవారం సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమర్ది చిన్నమస్తాన్ నేతృత్వంలో సంఘ నేతలు తోట కరుణ, వెంకయ్య దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తోట దంపతులను దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన తోట కుటుంబానికి ప్రభుత్వం సముచిత స్థానం కలిపించడం హర్షణీయమని చిన్నమస్తాన్ పేర్కొన్నారు. నూర్‌బాషా, దూదేకుల సంక్షేమానికి, అభ్యున్నతికి అన్ని రకాల తోడ్పాటునందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని చెప్పారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాజా రసూల్, ప్రధాన కార్యదర్శి షేక్ రహీమ్‌తుల్లా, మహిళా అధ్యక్షురాలు షేక్ ఖాదర్‌బీ, బాపులపాడు మండల మహిళా అధ్యక్షురాలు లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలి

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర సోమవారం ఈడుపుగల్లు గోసాల కాల్వ కట్ట ప్రాంతాల్లో నిర్వహించారు. ఏలియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను పూర్తిగా విస్మరిస్తుందని మండిపడ్డారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, నాయకులు కుంభ వెంకటేశ్వరరావు, గరిక దుర్గాప్రసాద్, లాం ప్రతాప్, గరిక వెంకటేశ్వరరావు, కందులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

24 నుంచి నియోజకవర్గ స్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా'

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నియోజకవర్గ స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ రాజు తెలిపారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ రాజు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తామన్నారు. కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలతో పాటు తాడిగడప మున్సిపాలిటీ నుంచి 40 జట్లు వివిధ పోటీలకు సిద్ధం చేశామని తెలిపారు. 24వ తేదీన షటిల్, కబడ్డీ, 25వ తేదీన ఖోఖో, వాలీబాల్, 27, 29 తేదీల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మూడు మండలాల అధికారులు పాల్గొన్నారు.

మహిళ అరెస్టు

పెనమలూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప శ్రీనివాసానగర్ కాలువ కట్టకు చెందిన సింహాద్రి శివ నాగమణి అక్రమంగా మద్యం విక్రయిస్తుదన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఆమె వద్ద 78 మద్యం సీసాలు, రూ.1210 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారిపై శ్రీరామ శోభయాత్ర


తాడిగడపలో శ్రీరామ భక్తుల ప్రదర్శన


గన్నవరం రామాలయంలో లక్ష పుష్పార్చనలో భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అయోధ్య రామమందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠామహోత్సవాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రధాన కూడలిలో భక్తుల సందడి ఏర్పడింది. జైశ్రీరామ్ నామస్మరణతో జంక్షన్ మారుమోగింది.

ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, ఆయన సోదరులు శివాజీ రాజు, ప్రసాదరాజు ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహించిన శ్రీరామ శోభయాత్ర కనులపండువగా సాగింది. వందలాది భక్తులు, డప్పు వాయిద్యా కళాకారుల విన్యాసాలు, మహిళల కోలాట ప్రదర్శనతో ఊరేగింపు జరిగింది. ఆంజనేయ సమేత సీతారామచంద్రుల విగ్రహాలతో జరిగిన శోభయాత్రకు ప్రజలు నీరాజనాలు పలికారు. ప్రధాన కూడలిలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం నుంచి వేలేరు క్రాస్‌రోడ్డులోని శ్రీరామచంద్రస్వామి దేవస్థానం వరకు శోభయాత్ర ఘనంగా జరిగింది. అనంతరం అభయాంజనేయ స్వామి, సీతారాముల ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అయోధ్య రామమందిర ప్రతిష్ఠామహోత్సవం ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ప్రధాన కూడలి, వేలేరు క్రాస్‌రోడ్డుల వద్ద భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. జంక్షన్ సెంటర్‌లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద శ్రీరామభక్త బృందం అన్నప్రసాద వితరణ నాలుగు వేలమందికి చేశారు. వేలేరు క్రాస్‌రోడ్డు వద్ద రామచంద్ర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన మరొక అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ప్రధాన రహదారుల్లో పలుచోట్ల వర్తక, వ్యాపారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తులకు పానకం, ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు.

పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

గన్నవరం: అయోధ్య రామ మందిరం ప్రతిష్ట సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో తెల్లవారుజామున నగర సంకీర్తన, రామ నామ సంకీర్తన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం జరిపారు. ఆలయ అర్చకులు ఎస్.రామచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు జరిపిన వివిధ పరిమళభరిత పుష్పమాలలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు. స్థానిక యాదవుల రామాలయంలో స్వామివారికి లక్ష పుష్పార్చన చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శర్మ, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలం లోని చలివేంద్రపాలెం గ్రామంలో వేంచేసిన అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రామ నామము హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజా గురుస్వామి సీతారామాంజనేయ స్వామి భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో జై శ్రీరామ్ సంకీర్తన

పెనమలూరు: మండలంలో జై శ్రీరామ్ సంకీర్తన మారుమోగింది. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిగడప మిత్రజ్యువల్ అపార్టుమెంట్‌లో భక్తులు రామ మందిరం ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరాముడి చిత్రపటంతో ప్రదర్శన చేశారు. శ్రీరామ సంకీర్తన చేశారు. భక్తుల ఎంవి. సాయిబాబు, గంగాధర్, రమేష్, సాయిరాం, విశేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు. పోరంకి గంగానమ్మ గుడి వద్ద శివసతి చారిటబుల్ ట్రస్టు, బొర్రా కృష్ణ యూత్ ఆధ్వర్యంలో అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను వీక్షించటానికి డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు.

నున్న(విజయవాడరూరల్): అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం నున్న గ్రామం రామనామ సంకీర్తనతో మారు మోగింది. నున్న గ్రామ శివారు బోడపాడు నుంచి స్వామి వారి కల్యాణ విగ్రహాలతో మేళతాళాలతో, కోలాటాలు, భజన బృందాలతో అశోక్ ఫంక్షన్ హాలు వరకు శోభాయాత్ర జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదముల పంపిణీ, అన్నదానం చేశారు. తూర్పు బజారు శ్రీకోదండరామస్వామి ఆలయంలో భక్తులు స్వామి సహస్రనామార్చన, హనుమాన్ చాలీసా జరిగింది. పడమట బజారులోని శ్రీరామాలయంలో కల్యాణమహోత్సవం జరిగింది. రంగాదిమ్మ వద్ద శ్రీకోదండరామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని పాల్గొన్నారు. సాయంత్రం రామనామ సంకీర్తన నిర్వహించి దీపోత్సవం చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చిన కంచిలో శ్రీరాముల అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. రామనామ సంకీర్తన చేశారు. మంగళాపురంలో రామాలయంలో విశేషపూజలు నిర్వహించారు. తీర్థప్రసాదముల వితరణ, సాయంత్రం రామనామ సంకీర్తన, దీపోత్సవం నిర్వహించారు.

మండల స్థాయి క్రికెట్ విజేత 'జక్కంపూడి'

నున్న(విజయవాడరూరల్): ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా సోమవారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో జక్కంపూడి టీము గెలుపొందింది. నున్న-1, జక్కంపూడి-1 టీముల మధ్య మండల స్థాయి ఫైనల్ క్రికెట్ పోటీలు జరగ్గా నున్న టీము 10 ఓవర్లలో 58 పరుగులు తీయగా, జక్కంపూడి టీము 9.1 ఓవర్లలో 59 పరుగులు తీసినట్టు పీడీ టీవీ వర్మ తెలిపారు. జక్కంపూడి టీము మైలవరం నియోజకవర్గ పరిధిలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు ఆయన చెప్పారు. విజేత జక్కంపూడి టీమును పలువురు అభినందించారు.

భర్త, అత్తపై కేసు నమోదు

పెనమలూరు: వివాహితపై దాడి చేసిన భర్త, అత్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెనమలూరు గ్రామానికి చెందిన చిట్టూరి కుమారి గత 9 సంవత్సరాల క్రితం గంగూరు గ్రామానికి చెందిన సతీష్‌ను వివాహం చేసుకుంది. భార్యభర్తలు పెనమలూరులో ఉంటున్నారు. కాగా ఈ నెల 19వ తేదీన భర్త గంగూరు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. భర్త ఇంటికి రావటంలేదని భార్య కుమారి గంగూరులో ఉంటున్న అత్తగారి ఇంటికి ఆదివారం వెళ్లింది. దీంతో భర్త సతీష్, అత్త సుశీల కట్నం కావాలని కుమారితో గొడవపడి దాడి చేశారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామన్నారు.

వలంటీర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: గోసాలలో వలంటీర్‌ను బెదిరించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల సాయినగర్‌లో వలంటీర్ బిల్లా నాగవెంకట ఆంజనేయప్రసాద్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను గోసాల సచివాలయం-2లో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. అయితే అదే ప్రాంతానికి చెందిన మెరుగుసాయి ఆదివారం మద్యం తాగి వచ్చి వలంటీర్‌ను అకారణంగా బెదిరించి దూషించాడు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే చెప్పండి

నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రలీల

గన్నవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఓటర్ల జాబితా తుది ప్రచురణపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బీ చంద్రలీల నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ వివరాలను ఆమె వెల్లడించారు. గత ముసాయిదా ఓటర్ల జాబితాకు ప్రస్తుత తుది ఓటర్ల జాబితా వ్యత్యాసాలను వివరించారు. చంద్రలీల మాట్లాడుతూ..ఓటర్ల జాబితా తుది ప్రచురణను నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 306 పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. తహసీల్దారు సీహెచ్. నరసింహారావు, ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దారు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పోరంకిలో వ్యక్తిపై ముగ్గురు దాడి చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు పల్లిపేటకు చెందిన వల్లభనేని నాగమల్లేశ్వరరావు బోర్‌వెల్ పనులు చేస్తాడు. అతను గత కొద్ది రోజుల క్రితం పోరంకి సాలిపేటకు చెందిన శ్రీను అనే వ్యక్తి ఇంట్లో బోరు పనులు చేశాడు. పని చేసినందుకు సొమ్ము అడగ్గా సంక్రాంతి పండుగ తరువాత ఇస్తానని శ్రీను తెలిపాడు. అయితే శ్రీనుతో ఉన్న గోగం గోపి సొమ్ము ఇచ్చేదిలేదని నాగమల్లేశ్వరరావును బెదిరించాడు. కాగా శ్రీను ఈ నెల 14వ తేదీన ఫోన్ చేసి సొమ్ము ఇస్తానని నాగమల్లేశ్వరరావుకు చెప్పాడు. దీంతో నాగమల్లేశ్వరరావు, అతని సోదరుడు శ్రీనివాసు కలిసి సాలిపేట శ్రీను ఇంటికి వెళ్లారు. అయితే అక్కడే ఉన్న గోగం గోపి, గోగం బన్ను, గోగం వీరబాబు సొమ్ము ఇచ్చేదిలేదని దాడి చేశారు. ఈ దాడిలో నాగమల్లేశ్వరరావు తలకు గాయమైంది. గొడవలు వద్దని పెద్దలు నచ్చ చెప్పటంతో ఘటన పై తొలుత బాధితుడు ఫిర్యాదు చేయలేదు. అయితే నాగమల్లేశ్వరరావు ఎక్కడ కనిపించినా, ఎదురు దాడి చేసినా చంపుతామని బెదిరించసాగారు. దీంతో బాధితుడు భయంతో ఆలస్యంగా ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఉంగుటూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్ రెడ్డి అన్నారు. వేంపాడు గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అవినీతి రహిత పాలన అందజేస్తోందన్నారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాలు ప్రత్యక్ష నగదు రూ.10.91కోట్లు, పరోక్ష నగదు రూ.3.68 కోట్లు లబ్ధి చేకూరిందని ఎంపీడీవో శేషగిరిరావు వివరించారు. అనంతరం సచివాలయం వద్ద ఆ గ్రామానికి జరిగిన అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్.శివనాగబాబు, మండల సచివాలయ కన్వీనర్ వింత ఆదినారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైరపర్సన్ సోమేశ్వరరావు, రాజేశ్వరరావు, శివశంకర్, నాగరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పార్టుటైం యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా వైద్యాధికారి డాక్టర్ కె.వాహిని సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. దీనికి గానూ రెండు యోగా శిక్షకుల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. డిగ్రీ విద్యార్హత కలిగి, యోగా శిక్షణలో అనుభవం కలిగిన వారిని నియమించనున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్త్రీలకు రూ.5 వేలు, పురుషులకు రూ.8 వేల చొప్పున వేతనం చెల్లిస్తామన్నారు.

బాలిక అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు లంబాడీపేటకు చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా రెండో కుమార్తె (14) గ్రామంలో ఎన్టీఆర్ బస్‌స్టాపు వద్ద వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుంది. ఈ నెల 21వ తేదీన పనికని వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆమె జాడ తెలియలేదు. దీంతో ఈ విషయమై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.